[ కథానిక ]

# పతితపవిత్ర

—జి. బాబురావ్

'నా' అనేవాళ్ళు లేకపోయినా లోకమంతా తనదే నంటుంది లక్ష్మి. పాపం చేయటం మహాపాప మంటారు. అదెంతవరకు నిజమోకాని, నేనేది చేసినా అది నా మంచికోసం నా పొట్ట పోషించుకోవటం కోసం చేస్తున్నాను, నేను చేస్తున్న వేశ్య వృత్తి తప్పుగా నాకెప్పుడు అనిపించలేదు, అనిపించదు. అని ధృఢంగా జవాబిస్తుంది

మరీ చిల్లరగా కాక పోయినా ఆదాయం పెరిగే కొలది ఒక్కధనవంతులకే అవకాశం యిచ్చేది. బాగా డబ్బు గడిస్తున్నా, తన పెద్ద పాక మటుకు విడిచేది కాదు. పెద్ద యింట్లో కంటే అ పాక లో నే అదృష్టం కలిసొచ్చి, ఆనందం, సుఖాన్ని, పంచిపెడుతోందంటుంది

లక్ష్మి మంచి రూపవతి, వంపులు తిరిగిన శరీర సౌష్టవం కలిగి, చూపరులను యిట్టే ఆకర్షిస్తుంది

తానెంత వేశ్య అయినా, లోకానికి భయపడక పోయినా. దేవుడంటే భయమూ, భక్తి మెండు, ప్రతి సోమవారం తలంటు పోసుకొనీ శివుణ్ణి ధ్యానిస్తుంది

మొదట అందరి కోర్కె తీర్చే లక్ష్మి, ఇప్పుడు ధనవంతుల ఇష్టానికే తలఒగ్గడం మధ్య తరగతి వాళ్ళకు గిట్టలేదు. ఎలాగైనా లక్ష్మినీ తమ ఊరినుండి తరిమేయాలని నిశ్చయించుకొని ప్రతి చిన్న విషయంలో లక్ష్మిని అకారణంగా దూషించేవారు — సంసారులకు సందు దొరికితే లక్ష్మిని చితకతన్ని తమ కసిని తీర్చుకోవాలని వుబలాట పడుతున్నారు. 'లం......నీనుంచి నా మొగుడు పాడై పోయినాడే, నిన్ను సంపినా పాపంలేదే ముండా అంటూ తమ అక్కసు వెళ్ళగ్రక్కేవారు.

ఎదుటి వాళ్ళు ఎంతగా తిట్టినా మనసులో బాధ పడేదేగాని పైకి ఏమీ అనేది కాదు ఒక్కో సారి దిండులో తలదూర్చి తన బలహీనతను తలచుకొని ఏడ్చేది. కాని తన వేశ్య వృత్తిని మాత్రం విడిచేది కాదు ప్రతి రాత్రి ఎవరో ఒకరి బాహుబంధాలలో నలిగి పోయేది. తనఅందాన్ని అడవికాచిన వెన్నెల్లా చేసుకునేది. తన శరీరం ముళ్ళకంపల్లో ఇరుక్కున్న పక్షిలా గిలగిల తన్నుకొని ఎప్పటికైనా రాలిపోతుందనీ తెలుసు మరి కొంత కాలమయ్యేసరికి యీ శరీరమే క్రుశ్శి కృషించి ఎందుకూ పనికిరాకుండా పోతుంది తనను ఒక దేవతలా ఆరాధించి (మరోమాటలో చెప్పాలంటే) యంత్రంలా ఉపయోగించుకుంటున్న యీ ప్రజలే తనను చూసి అసహ్యించుకుంటారు. జరగబోయే నిజాన్ని వూహించుకొని నిలువెల్లా కంపించిపోయింది లక్ష్మి.

* * *

రోజులు గడిచిపోతున్న కొద్దీ గ్రామప్రజల్లో ఉడుకు రక్తం పొంగి పొర్లుతూంది —— లక్ష్మిని అనుభవించటానికై వెర్రివెధవలు అర్రులు చాస్తున్నారు, కాని, కొందరు రెడ్డిబాబులు కంటికి రెప్పలా కాపాడుకొన్నారు

ఆ యేడు జాతరలు మొదలయ్యేయి పదు రోజుల జాతరలు మహా సంబరంగా జరిగిపోయాయి. ఆఖరి రోజు లక్ష్మి కూడ జాతర చూడటానికై ఒంటరిగా వెళ్ళింది. ముందుగా దేవి దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో అడుగు పెట్టింది,

మహంకాళి విగ్రహాన్ని చూస్తున్న లక్ష్మిలో భయం, భయంతో పాటు మంచీ, చెడులమధ్య ఘర్షణ ప్రారంభమయ్యింది. వాగ్వివాదం జరిగింది చివరకు చెడుఅలసిపోయి ఓటమి అంగీకరిరచింది. లక్ష్మిలో పరివర్తన కలిగింది. ఆ దేవి ముందు మోకరిల్లి తన పాపాలను క్షమించమని కోరింది. ఆనాటినుండి వేశ్యగా బ్రతకటం మాని, సాటిస్త్రీలా కష్టపడి పనిచేసి జీవిస్తానని ప్రమాణంచేసింది.

దూరంగా ఎక్కడో కోయిల తన మధురమైన కంఠం సవరించి తియ్యగా పాడుతోంది. చల్లటిగాలి మేను తాకి పులకరిస్తోంది. ఆకాశంలో దూదిపింజల్లా ఎగిరిపోతున్న మేఘాల్లా లక్ష్మి హృదయంలో భారం తొలగి తేలి పోతోంది.

తరువాయి 19 పుటలో

# పతిత — పవిత్ర

[14వ పేజీ తరువాయి]

పెళ్ళుబికి వస్తున్న సంతోషంలో వన్నె లేడి పిల్లలా ఒక్క వగుగున ఆలయ ప్రాంగణం దాటింది బయట కోలాహలంగా వుంది. తను కూడ ప్రజల మధ్యకు వెళ్ళింది. వాళ్ళతో పాటు నిజమైన సుఖాన్ని, ఆనందాన్ని, పంచుకోవటానికై ఆపాత్రయ పడింది.

రంగులరాట్నం చూడగానే ఎప్పుడో ఒకసారి ఎక్కటం గుర్తొచ్చి మళ్ళీ యిప్పుడు ఎక్కాలనిపించి ఎక్కింది. చీకటి పడే వరకు తన యిష్ట మొచ్చినట్లు తిరిగింది.

మామూలుగా ప్రతియేడు జాతర్లు ఆ గ్రామ పొలిమేరల్లో వున్న మహాంకాళి గుడి వద్ద జరుగుతుంటాయి గ్రామానికి కనీసం ఆరుమైళ్ళ దూరమున్న వుంటుంది చీకటి పడే కొద్దీ జనం పలచబడి పోతున్నారు లక్ష్మి తిరుగుముఖం పట్టింది రెండు మైళ్ళు రాగానే మరీ చీకటై పోయింది చుట్టూ కలయ చూసింది ఎవరైనా తోడుగా వస్తారేమోనని, కనుచూపు మేరలో ఎవరూ లేరు వాతావరణం ప్రశాంతంగా నిర్మానుష్యంగా ఉంది.

గబగబ అడుగులు వేస్తున్న లక్ష్మి కాళ్ళు ఒక్క సారిగా ఆగిపోయాయి. ఎదురుగా గోపి చేతులు చాపి దారి కడ్డంగా నిలుచున్నాడు. అంత చీకట్లోనూ అతని కళ్ళలోని కామవాంఛను, దాహాన్ని గుర్తించ గలిగింది.

లక్ష్మి గుండెలు గుభేలు మన్నాయి అసలు ఒంటిగా రావటమే తప్పు గంటక్రితమే తన జీవితాన్ని దేవి యెదుట ప్రమాణంచేసి మార్చుకుంది. తనిప్పుడు వేశ్య కాదు. అతని కోర్కె తీర్చటానికి తన దగ్గర శక్తి లేదు.

గోపీ దారి కడ్డులే...చాల చీకటి పడింది, త్వరగా ఇల్లు చేరాలి అంది సౌమ్యంగా

లక్ష్మి యింత త్వరగా ఎవరి కోసం వెళ్ళాలి ప్రతి రోజు నీ కోసం వెర్రి వానివలె పరితపిస్తున్న యీ దీనుని కోసం, యీ ఒక్క రోజు ఒక గంట వ్యర్థం చెయ్ అంటూ లక్ష్మిని గట్టిగా కౌగలించుకున్నాడు.

గోపీ విడిచిపెట్టు గోపీ నీకు చేతులెత్తి మ్రొక్కుతాను నన్ను వదిలి పెట్టు యీ రోజు నుండి నేను వేశ్య వృత్తిని విడిచి పెడుతున్నానని దేవితో వాగ్దానం చేశాను. నన్ను క్షమించి విడిచిపెట్టు...... నేనిప్పుడు వేశ్యను కాను యింత కాలం తెలియక చీకటిలో సంచరించాను, యిప్పుడు వెలుగుకోసం నా పాపాలన్నీ ఆ దేవి దగ్గర చెప్పుకొని పునర్జన్మ ప్రసాదించమని కోరుకున్నాను నేనూ మనిషినే ......నాకూ హృదయముంది. మీలాగే నాకూ ఆశలూ ఆశయాలున్నాయి, సాటి ఆడదానివలెనే నా యీ శేష జీవితాన్ని గడపటానికై నిశ్చయించుకున్నాను గోపీ! యిప్పటికైనా యీ దీనురాలిమీద దయచూపి నీ తోబుట్టువుగా నన్ను పవిత్రంగా చూడు నన్ను విడిచి పెట్టు అంటూ ఏకధాటిగా ఏడుస్తూ వేడుకొంది.

ఆ అబల హృదయ ఘోషకు కొండ శిలలే కరిగాయి, ప్రకృతిలో భయంకరమైన మార్పే బహుశు దేరిందే కాని, గోపి హృదయం చలించలేదు ఆ పతిత హృదయ వేదనకు లొంగిపోలేదు. ఆ కామాంధుని కౌగిలిలో నిస్సహాయురాలై నలిగి, వాడి, రాలిపోయింది. చేతిలో ఉన్న దేవి ప్రసాదం నేలపాలైంది.

ఆకాశం నిండా మేఘాలు దట్టంగా క్రమ్ముకున్నాయి. జల్లు పడనారంభించింది. గాలివేగం పెంచ్చింది. దూరంగా పెద్ద పెద్ద మఱ్ఱిచెట్లు జడలు విరబూసికొన్న దయ్యాల్లా భయంకరంగా కన్పిస్తున్నాయి. ఆ భయంకర నిశిధిలో ఒళ్ళుగగుర్పొడిచేలా ఎక్కడో దూరంగా గుడ్లగూబ అరుస్తోంది.

అలసిపోయిన గోపి నిలుచోగానే దారి ప్రక్క పొదల్లో ఉన్న నల్లత్రాచు కాటుకు నురుగులు కక్కుతూ నిలుచున్న పాటునే కుప్పలా కూలిపోయాడు.

(సమాప్తం)

# పీడకల

...శ్రీ ప్రియ

నిన్న రాత్రి కల వచ్చింది
పల్చటి చీకటి పొర
చీకటిలో ఎర్రటి నెత్తుటి రేఖలు
రేఖల చిట్టూ కలసి పోతూ
తిరుగుతూన్న వలయాలు
వలయాల్ని వరించికొని
తెల్లటి ధూమకణాలు మెరుస్తున్నాయి
స్ఫటికంలా మెరుసున్న మనస్సులో
వెలసిన రంగుల్తో ఎవరో
పిచ్చి గీతలు గీసున్నారు
ఉన్నట్టుండి
మెరుపు మెరిసింది
మనస్సు రగిలింది
గొంతుక చుట్టూ
ఉరిత్రాడు బిగుసుకుంది